## ఈజీఎస్ పనులు సంతృప్తి కరం


కొండాపూర్‌లో పర్యటిస్తున్న సభ్యులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** మండలంలో జరిగిన ఈజీఎస్ పనులు సంతృప్తి కరంగా ఉన్నాయని నేషనల్ లేవల్ మానిటరింగ్ టీం మేనేజర్ గంగప్ప అన్నారు. శుక్రవారం మండల పరిధి సూరారం, ఎస్ కోండాపూర్, గజగట్లపల్లి, శాలీపేట గ్రామాలలో పర్యటించి ఈజీఎస్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 2020-2022 వరకు జరిగిన ఈజీఎస్ పనులను పరశిలించారు. ఉపాధి హామి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపీవో వెంకటసాయి గౌడ్, రాజేందర్, టీఏ రాజేష్, శ్రీను, సంపత్, సర్పంచులు, మీనా రవీందర్, శశిరేఖ, పోచయ్య, నీరజ పంచాయతీ కార్యదర్శులు నాంపల్లి, రజనికాంత్, సంతోష్‌లు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటీలోని 6వ వార్డులో సెయింట్ ఆన్స్ హైస్కూల్ దగ్గర యుజిడి డ్రైనేజ్ పనులను కొబ్బరికాయలు కొట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవి, వైస్ చైర్మన్ శంకరి లతావిజయేందర్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయ లక్ష్మిరవి, వైస్ చైర్మన్ శంకరి లతావిజయేందర్‌రెడ్డి లతో పాటు కౌన్సిలర్ సొహేల్, సెయింట్ ఆన్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్, కాలనీవాసులు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా

### ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, సెప్టెంబర్2 ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి పేదలకు వరం అని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో మెదక్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మొత్తం 58 మంది లబ్ధిదారులకు రూ.30,20,500 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు వేలాది మంది పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఏడాదికో, రేండేళ్లకోసారి వచ్చేదని గుర్తు చేశారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరంతర ఆర్థిక సహాయం అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్‌గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం. గంగాధర్, కౌన్సిలర్ ఆర్‌కె. శ్రీనివాస్, ఎంసీ డైరెక్టర్ సాప సాయిలు, నాయకులు రాగి అశోక్, శ్రీధర్ యాదవ్, బొద్దుల ప్రవీణ్‌గౌడ్, కృష్ణ, మధు, బాలయ్య, వెంకట్రావ్, శ్రీనివాస్, మెదక్ నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్ క్షేత్ర నిర్వహణ భేష్ : కంచి పీఠాధిపతి


పీఠాధిపతికి ఆలయ నిర్మాణ మ్యాప్‌ను అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త):** వర్గల్ శ్రీ విద్యాధరి ఆలయ పనితీరు, వైధిక నిర్వహణ బాగుందని కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్రసరస్వతీ స్వామీజీ కితాబిచ్చారు. కాకినాడ శివారులో చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతిని విద్యాసరస్వతీ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెల్లవారుజామున కలిసి క్షేత్రం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను స్వామీజీ దృష్టికి తెచ్చారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వాజ్ఞ మఠం పనులు చురుకుగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే అక్షరాభ్యాస మండపం ప్రారంభం, ఆలయ నవరాత్రి మహోత్సవాలలో పాల్గొనాలని కంచి స్వామివారికి ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. సానుకూలంగా స్పందించిన స్వామీజీ కంచి పీఠానికి అనుబంధంగా ఉన్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం వద్ద భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలని, ఆధ్యాత్మిక శోభను ప్రజ్వలింపజేయాలని, వేద విద్యను మరింత విస్తరింపజేయాలని స్వామీజీ ఆకాంక్షించారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ విద్యాధరి క్షేత్ర పురోగతికి తన సంపూర్ణ ఆశీస్సులు ఉంటాయని స్పష్టం చేశారు.

## హరిత లక్ష్యాన్ని త్వరితగతిన సాధించాలి

### జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శరత్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు, తదితర అధికారులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** జిల్లాకు నిర్దేశించిన హరిత లక్ష్యాన్ని త్వరితగతిన సాధించాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. మన ఊరు-మన బడి, హరితహారం, కోవిడ్ వాక్సినేషన్ తదితర అంశాలపై సంబంధిత జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హరితహారం లక్ష్యాలను వేగవంతంగా సాధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వారి సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మన ఊరు-మన బడి పనులకు సంబంధించిన పేమెంట్స్ చెల్లించేలా ఈనెల ఏడవ తేదీలోగా ఎంబి రికార్డ్ చేసి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్సీ వారిగా ఆయా ఫారామీటర్స్ మేరకు సాధించిన లక్ష్మాలను సమీక్షించారు. వందశాతం లక్ష్మాన్ని సాధించాలన్నారు. జిల్లాలో పంట నమోదు కార్యక్రమాన్ని వందశాతం పూర్తిచేయాలని సంబంధింత అధికారులకు ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, డిఆర్డీఓ పిడి శ్రీనివసరావు, జెడ్పీసీ ఈఓ ఎల్లయ్య, డిపిఓ సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ జెడి నరసింహారావు, అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్ రూంలకు దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంతో పాటు మండల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, మున్సిపల్ పరిధిలోని అర్హులైన ప్రజలు ఇండ్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సెప్టెంబరు 9వ తేదీ వరకు నిత్యం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధరఖాస్తులు అందచేఆయలని తహసీల్దార్ పేర్కొన్నారు.

# ఓటరు నమోదు తప్పనిసరి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్, తదితరులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** స్వీప్ యాక్టివిటీ, ఓటరు నమోదు, ఓటర్ కార్డ్‌నకు ఆధార్ అను సంధానం, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదయ్యేల చర్యలు తీసుకోవాని రాష్ట్ర ఎన్నికల ప్రధానకారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్, అదనపు కలెక్టర్‌లు రాజర్షి షా, వీరారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన వారందరి వివరాలను స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సేకరించి వారిని నూతన ఓటరుగా నమోదు చేయాలనీ సూచించారు. జిల్లాలో ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలతో బూత్ లెవెల్ స్థాయి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారి సహకారంతో నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో చదువుతున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఓటరు ప్రాముఖ్యత వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్ అనుసంధానం వేగవంతంగా పూర్తి చేయాలని, అధికారులు ఆదేశించారు. ఓటరు నమోదు, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం అంశాలపై సమీక్షించి, పలు సూచలను చేశారు. ఓటరు నమోదు ఫారాలు అవసరమైనన్ని అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. 18 సంవత్సారాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అందుకు చౌకధర దుకాణాల డీర్లను భాగస్వాములను చేయాలని సూచించారు. ఓటర్లకు గరుడా యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్ వైజార్లు ప్రత్యేక దృష్టి సారించి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రాపర్గా చేయాలని ఆదేశించారు. వచ్చే వారంలోగా 75 శాతం ఆధార్ లింకేజీ పూర్తి చేయాలని ఆయన కోరారు. స్వీప్ ఆక్టివిటీస్ ముమ్మరం చేయాలని, అట్టి కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాల మహిళలను పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీఓలు, ఐసిడిఎస్ టీచర్లు, సూపర్వైజర్లు, డిఎల్‌పిఓలను భాగస్వాములను చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, డిఆర్ఓ రాధికారి రమణి, రెవెన్యూ డివిజనల్ అధికారి నగేష్, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

# గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు

### - ప్రైవేటు ఆసుపత్రిపై అధికారుల దాడులు
### - ఆసుపత్రి సీజ్.. రికార్డుల స్వాధీనం


ఆసుపత్రిని సీజ్ చేసిన అధికారులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ న్యూలైప్ ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్లు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్ నేతృత్వంలో వైద్యులు, పోలీసు, రెవెన్యూ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. గత కొంత కాలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ఆసుపత్రిలో అబార్షన్లు చేస్తున్నారని తెలియడంతో దాడులు నిర్వహించి రికార్డులను పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశారు. ఆసుపత్రిలో ఆడ పిల్లలు వొద్దు అనుకునే వారికి లింగానిర్ధణ పరీక్షలు చేసి అబార్షన్లు చేస్తున్నట్లు తెలిసింది. అబార్షన్లు చేసిన బాధితులను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ భారత్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో దాడులు నిర్వహించి ఆసుపత్రిని సీజ్ చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అసుపత్రికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. జిల్లాలో అసుపత్రులు అనుమతులు లేకుండా నిర్వహిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఆసుపత్రికి తప్పకుండా రిజిస్ట్రేషన్ ఉండాలన్నారు.


అక్రమంగా నిర్మించిన స్లాబ్‌తోపాటు పెంట్‌హౌజ్ కోసం వేసిన సెంట్రింగ్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

# అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

### -మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణం కూల్చివేత
### -మున్సిపల్ కమిషనర్ విద్యాధర్

**గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :** అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎస్.విద్యాధర్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాపూర్ రోడ్డులో గల యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న కాలనీలో అనుమతి లేకుండా ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకుడు ఆసుపత్రి ఏర్పాటు కోసం మున్సిపల్ నుండి ఐదు అంతస్తులకు అనుమతి పొందాడు. కాగా ఇట్టి నిర్మాణంలో ఆరవ అంతస్తుకు స్లాబ్ వేశాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.విద్యాధర్ శుక్రవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి దీపిక, కార్యాలయ సిబ్బందిని అక్కడికి పంపించగా స్థానిక పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణంను కూల్చివేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా ఇళ్ళను నిర్మిస్తే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయడం జరుగుతుందన్నారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకొని ఇళ్ళ నిర్మాణం చేపట్టాలన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రతి ఒక్కరూ సెట్‌బ్యాక్ తీసుకొని ఇళ్ళు నిర్మించుకోవాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న పలు ఇళ్ళ యజమానులు సెల్లార్లను అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే వక్ఫ్‌బోర్డు స్థలాలలో ఇళ్ళను నిర్మించరాదని, ఎవరినీ ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించే ఇళ్ళపై నిఘా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

**అధికార పార్టీ నేతల వత్తిడికి తలొగ్గని కమిషనర్**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమీషనర్ విద్యాధర్ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి భవనాలను కూల్చివేసే పనిలో నిమగ్నమయ్యారు. అక్రమార్కుల గుండెల్లో రైలు పరిగెత్తేలా కమిషనర్ తన పనిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పినా తన పరిధి మేరకు పనులు చేస్తూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం ఓ ప్రైవేట్ వైద్యునికి చెందిన ప్రైవేట్ ఆసుపత్రి పెంట్‌హౌజ్‌తో పాటు మరో ఫ్లోర్‌ను తమ సిబ్బందితో కూల్చివేశారు. రాజకీయ వత్తిడులకు తలొగ్గకుండా పట్టణ ప్రజల మనసులో తనకంటూ పేరును సంపాదించుకుంటున్నారు. భవనం కూల్చివేత సమయంలో ప్రముఖ నాయకుడు ఫోన్ చేసినప్పటికీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ స్లాబ్‌ను కూల్చివేశారు. ఎంతటివారైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా, వెంచర్లు ఏర్పాటు చేసినా, అమాయకులను మోసగించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న మంత్రి హరీష్ రావు

## మనసున్న మహారాజు సీఎం కేసీఆర్

### మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
### అనేక సంక్షేమ పథకాలకు నిలయం తెలంగాణ
### త్వరలో మెదక్‌కు 500 పడకల ప్రభుత్వ ఆసుపత్రి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** దేశానికే తెలంగాణ రాష్ట్రం గర్వకారణమని మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్‌లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు దేశంలో ఎక్కడా, ఏ ప్రభుత్వం కూడ ఇవ్వడం లేదని మంత్రి హరీష్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు వివిధ పెన్షన్లు కేవలం జిల్లా వ్యాప్తంగా 7000 మాత్రమే ఉండేవని, ప్రస్తుతం కేవలం చిన్నశంకరంపేట మండలంలో 7270 పెన్షన్లను అందిస్తుందని తెలిపారు. నేడు 1453 మందికి నూతన మంజూరు పత్రాలను లబ్దిదారులకు ఆయన అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో వివిధ పార్టీల నుండి నాయకులు తెరాస పార్టీవైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, ఆసరా పెన్షన్లు, ఒంటరి మహిళా, వృద్యాప్య పెన్షన్లు, వికలాంగ పెన్షన్లు వంటి రకరకాల వంటి వాటిని అందిస్తుంటే భాజాపా ప్రభుత్వం మాత్రం ఇవి ఇవ్వకూడదని అనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రైలు మార్గాన్ని పట్టుదలతో శ్రమించి సాధించుకున్నారని అన్నారు.

**మెడికల్ కాలేజి మంజూరు**

మరికొద్ది రోజుల్లో మెదక్ జిల్లాకు మెడికల్ కాలేజిని ప్రారంభిస్తామని మంత్రి హామి ఇచ్చారు. అలాగే 500 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కూడ నిర్మిస్తామని తెలిపారు. గతంలో ఆపరేషన్లు చేయాలంటే ప్రవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే 50వేల రుపాయల వరకు ఖర్చు అవుతుందని, ముఖ్యమంత్రి కార్పోరేట్ స్థాయిలో సామాన్యునికి ఉచిత వైద్యం అందించాలనే పట్టుదలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు డెలివరి అయిన వారికి కేసీఆర్ కిట్లను అందించి ప్రభుత్వ వాహనంలో ఇంటివరకు చేరుస్తున్న ఘనత తెరాస ప్రభుత్వానిదే అన్నారు. రానున్న రోజుల్లో మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**ఇంటి నిర్మాణానికి 3లక్షలు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు కూలిపోయి వీలు లేకుండా ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్న ప్రతి ఒక్క అర్హులైన వారికి ఇంటి నిర్మాణానికి 3లక్షల రుపాయలను మంజూరు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సి యాదవరెడ్డి, గ్రంధాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పి చైర్ పర్సన్ హెమలత శేఖర్‌గౌడ్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీటీసీ సభ్యురాలు పట్లోరి రాజు, సర్పంచి రాజిరెడ్డి, ఎంపిటీసీ రాధిక కుమార్‌గౌడ్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్, మాజీ సర్పంచి కుమార్ గౌడ్, మెదక్ ఆర్డివో సాయిరాం, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బయ్యర్లు కాదు..రియల్టరు 'కింగు'లు

### -పేదల ప్లాట్ల విషయంలో ప్రశ్నించిన తమపై అక్రమ కేసుల బనాయింపు
### -రియటర్లకు కొమ్ముకాస్తున్న అధికారులు


పోతారం(ఎస్)లోని రియల్‌భూమి దృశ్యం

**హుస్నాబాద్, సెప్టెంబరు2, ప్రభాతవార్త :** బయ్యర్ల ముసుగులో తాము కొనుగోలుదారులమని బిల్డప్ ఇస్తూ రియల్ మాఫియాలుగా చలామణి అవుతున్న ఈ బడా బాబులకు కొన్ని శాఖల అధికారులు అండగా నిలుస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లోని భూముల విషయంలో నెలకొన్న తగాదా విషయంలో ఒక ప్రభుత్వ ఉపాధ్యాయునితో పాటుగా అతనికి సహకరించారన్న నెపంతో మరి కొందరిపై పోలీసులు ఏకపక్షంగా కేసులు నమోదు చేయడంపై దుమారం గేంగుతోంది. ఈ విషయంపై పోతారం (ఎస్)లో గతంలో స్థలం కొనుగోలు చేశానని మాడ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుస్నాబాద్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఈ విషయంలో కేసులో ఇరికిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పంది సంపత్‌తో ఈ విషయంపై స్పందించారు. తాను ఈ స్థల అక్రమణకు అక్కడికి వెళ్ళలేదని వారికంటే ముందుగానే తాను పోతారం(ఎస్)గ్రామానికి చెందిన ఆలేటి వసంత వద్ద 2009 లోనే కొనుగోలు చేయడం జరిగింది. ఈ భూమిని మాడ నాగరాజు పది గుంటల మేర క్రమణకు గురి చేస పునాది నిర్మించుకున్నారు. దీనిపై ఇందుకు సగతంలోనే ఫిర్యాదును సంపత్ చేయడం జరిగింది. ఆలేటి మణెమ్మ తదితరలు నుండి మరో పది ఎకరాల స్థలాన్ని మాడ నాగరాజు తన తర్వాత కొనుగోలు చేసి వారు తన స్థలాన్ని సైతం తమ స్థలంలో కలుపుకుని పునాదులు వేసుకున్నారని పంది సంపత్ వివరించారు. నాగరాజుకు అతని సహచరులైన సొల్లేటి శంకరయ్య అక్రమంగా తన స్థలంలో పునాది వేయడంతో తాను గతంలోనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో పోలీసులు కొలతలు అయ్యేవరకు ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని ఆదేశించినప్పటకి నాగరాజు ప్రహారీగోడ నిర్మాణానికి ఉపక్రమించాడు. అక్కడ ఎలాంటి ప్రభుత్వ కొలతలు నిర్వహించకుండానే స్థలాన్ని ఎవరితో తేల్చకుండానే ప్రశ్నించిన తమ వారిపై హుస్నాబాద్ పోలీస్‌శాఖ తమపై అక్రమంగా కేసులు బనాయించారని వాపోతున్నారు. తన అనంతరం అక్కడ స్థలం కొనుగోలు చేసిన నాగరాజు ఇక్కడ తన స్థలాన్ని ఆక్రమించుకుని పునాది నిర్మించిన విషయంపై తాను సర్వే నిర్వహించాలని డిమాండ్ చేయడం జరిగిందని నాగరాజు సంబంధీకులు అక్కడ సర్వే నిర్వహించకుండా అడ్డుకునేలా అంతర్గతంగా తమ ప్రతాపానికన చూపించుకుంటూ దాట వేస్తున్నారని తమ ఫిర్యాదుపై స్పంద్చిని పోలీస్‌శాఖ వారి వద్ద ఫిర్యాదు తీసుకుని తమ వారిపై కేసు నమోదు చేయడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. సర్వే సక్రమంగా నిర్వహిస్తే అసలు స్థలం ఎవరిదో తేలుతుందని పంది సంపత్ స్పష్టం చేశారు.

**మాడ నాగరాజుకు బినామీలుగా 'సొల్లేటి' ....!**

హుస్నాబాద్ ప్రాంతంలో రియల్‌వ్యాపారాన్ని జోరుగా సాగస్తున్న మాడ నాగరాజు హుస్నాబాద్ ప్రాంతంలోని పోతారం(ఎస్)లోని స్థలం విషయంలో కాగితాలపై చెపుతున్నట్లుగా బయ్యర్ మాడ నాగరాజు కేవలం పేరు మాత్రమేనని ఇతనికి బినామీలు ప్రధానంగా సొల్లేటి శంకరయ్యతో పాటు పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త కొండ్లె శరత్, తేరాల సత్యనారాయణతో పాటు అతని కుమారుడు తేరాల మారుతిలు ఈ ప్రాంతంలో భూబకాసులుగా అవతారమెత్తి పేద వర్గాలను కాల్చుకుతంటున్నారని ఇందుకు పోలీసుల అండదండలు కారణమని సామాజిక ఉద్యమకారులు మేకల వీరన్నయాదవ్ మండిపడ్డారు. ఈ విషయంలో ఇటీవల పోతారం (ఎస్) స్థలం విషయంలో కొందరిపై కేసులు పెట్టడం దీనిని నిరూపిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా బాధ్యత కలిగిన పోలీస్‌శాఖ, తహసీల్ అధికారులు సర్వే నిర్వహించి పేదలకు చెందే భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించేలా చర్యలే చేపట్టేలా చూడాలని మేకల వీరన్నయాదవ్ డిమాండ్ చేశారు.


వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## వైఎస్ఆర్‌కు ఘన నివాళి

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగుజాతికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రామాయంపేట అధ్యక్షుడు చింతల యాదగిరి అన్నారు. శుక్రవారం వైయస్ రాజశేఖర్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలతో కలిసి పట్టణంలోని మెదక్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేష్, 1వ వార్డు కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి విప్లవ్, పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, ఎస్సి సెల్ నేత బైరం కుమార్, మండల నాయకుడు దోమకొండ వెంకటేష్ సగర, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మధు, మద్దూరి భాను, బొట్ల బాబు, సీనియర్ నాయకులు భూమ కిషన్, మోత్కు రాజు, శంకర్, నరేష్, నేరు తదితరులు పాల్గొన్నారు.

**బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో.....**


వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రూపులు మరోసారి బయటపడ్డాయి. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 13వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు విడివిడిగా జరపడమే ఇందుకు నిదర్శనం. శుక్రవారం మెదక్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఆయన వర్గానికి చెందిన పట్టణ మాజీ అధ్యక్షుడు దాకి స్వామి, చాకలి వెంకటి(వైఎస్), వార్డు మాజీ సభ్యుడు గుడాల లింగం, గొల్ల రమేష్, దాకి నరేందర్‌తోపాటు పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేష్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామిలు పాల్గొన్నారు. అనంతరం ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు చింతల యాదగిరి ఆధ్వర్యంలో మరోసారి వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

## జన హృదయ నేత వైఎస్ఆర్

**టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ**


వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి, జన హృదయ నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సేవలు తెలుగు జాతికి అజరామరమని టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ అన్నారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట రాజు, కాంగ్రెస్ నేతలు సంజీవ్, దయాసాగర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలి : సిఐ


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జార్జ్

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** వినాయక నిమజ్జన సమయంలో మండపాల నిర్వాహకులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లతో పాటు క్రేన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీజేలకు అనుమతులు లేవని, రాత్రి 12 గంటల వరకు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, ఎంపీటీసీలు దత్తు, వీణ సుభాష్‌గౌడ్, నాయకులు వంశీ, శంకర్‌గౌడ్, ఏఎస్ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

## 40వ రోజుకు చేరుకున్న విఆర్ఏల సమ్మె

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్2 ప్రభాతవార్త:** వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు రవీందర్ అన్నారు. శుక్రవారంనాటికి వీఆర్ఏల సమ్మె 40వ రోజుకే చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. వీఆర్ఏలకు పే స్కేల్, అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు,వారసులకు ఉద్యోగాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం ఉపాధ్యక్షులు ఎన్. బాగయ్య, ప్రధాన కార్యదర్శి సాయిలు, కోశాధికారి రాములు, సలహాదారుడు అశోక్, బేతయ్య, మల్లేశం, మమత, సామెల్, నారాయణ తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

**నిజాంపేట, సెప్టెంబర్2 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల వేతనాలు ప్రతి నెల ఒకటవ తేదీన అందజేయాలని సీఐటీయూ మండల కో-కన్వీనర్ నీలం బాబు శుక్రవారం అన్నారు. గ్రామాలను శుభ్రం చేయడంలో పారిశుధ్య కార్మికులు ముందుంటారని చెప్పారు. ప్రతి పారిశుధ్య కార్మికునికి నెలకు రూ. 15 వేల వేతనం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్యాలు బాగుంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. చెత్తా చెదారంతో మురికిగా ఉన్నట్లయితే రోగాలు, వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. ప్రభుత్వం శానిటైజర్, మాస్కులు, సబ్బులను ప్రతి నెలా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, బత్తుల రాములు, ఇందిరా, నర్సవ్వ, ఏసు, మైసయ్య, కుమార్, రాజవ్వ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ మండల కో-కన్వీనర్ బాబు

# కుటుంబానికి కొండంత అండ ఆసరా పెన్షన్లు

**మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**


ఆసరా పెన్షన్ పత్రాలను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఆసరా పెన్షన్‌లతో కుటుంబానికి కొండంత అండగా ఉంటుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాపన్నపేటలో గ్రామ సర్పంచ్ గురుమూర్తిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణి చేశారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సిఎం కెసిఆర్ ఆసరా పెన్షన్లు, రైతు బీమా, రైతు బంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసిఆర్ కిట్ లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి కేసిఆర్ బంగారు తెలంగాణ కోసం కృషి చేస్తుంటే కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధులను జారీ చేయకుండా సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూడటం సరికాదని ఆరోపించారు. గత ప్రభుత్వాలు మంజీరా నీటిని హైద్రాబాద్‌కు తాగునీటి కోసం సరఫరా చేసేవారని, ఇప్పుడు రైతులకు అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ కోసం రైతులు, ప్రజలు రోడ్డెక్కే వారని, ఇప్పుడు రౌండ్ ద క్లాక్‌గా నాణ్యమైన విద్యుత్‌ను రైతులు అందుకుంటున్నారన్నారు. మండలంలోని 36 గ్రామ పంచాయితీలకు 1545 మందికి మంజూరు అయిన పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు చందన ప్రశాంత్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, జిల్లా రైతు బంధు అధ్యక్షులు సోములు, పాపన్నపేట రైతు సహకార సంఘం డైరెక్టర్ గడీల శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు కుమ్మరి జగన్, కుబేరుడు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ లక్ష్మీకాంతారెడ్డి, టిఆర్ఎస్ నాయకులు దుర్గయ్య, బాబర్ పటేలన, అనీల్‌రెడ్డి, బాబాగౌడ్, గోపాల్‌రెడ్డి, రాము, రాజు, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేస్తున్న పంచాయతీ పాలకవర్గం

## పెన్షన్ పత్రాలను అందజేసిన పంచాయతీ పాలకవర్గం

**నిజాంపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** అర్హులందరికీ పింఛన్లు అందించడంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని సర్పంచి లద్ద ప్రీతి అన్నారు. నిజాంపేటమండలం నందిగామ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం మంజూరైన పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం సాధించాక ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. అదేవిధంగా 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ వర్తించేలా కృషి చేస్తానని చెప్పి ఇచ్చిన మాటకు కట్టుబడి నందిగామ గ్రామంలోని వృద్ధాప్య, వితంతువు, బీడీ కార్మికులకు సంబంధించిన 52 మందికి ఫించన్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో భాగంగానే శుక్రవారం లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, ఎంపీటీసీ లద్ద సురేష్, ఉప సర్పంచి రాజం తదితర పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## 40వ రోజుకు చేరుకున్న వీఆర్ఏల సమ్మె

**కొల్చారం, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షులు అబ్బాస్ అన్నారు. శుక్రవారం నాటికి వీఆర్ఏల సమ్మె 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. వీఆర్ఏలకు పే స్కేల్, అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు, 55 ఏళ్ల నిండిన వారి వారసులకు ఉద్యోగాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరఏలు శివ్వయ్య, రామయ్య, అంజయ్య, సత్తయ్య, భూమవ్వ, శివ్వయ్య, నర్సింలు, రాజు, గంగస్వామి తదితరులు ఉన్నారు.

## ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మహేందర్‌కుమార్

**మెదక్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** పాపన్నపేట మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అల్లం మహేందర్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. మెదక్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మహేందర్ కుమార్‌ను మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ అదనంగా ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం మహేందర్‌కుమార్ రెవిన్యూ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

## సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ

**బెజ్జంకి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో గురువారం మండల పోలీసుశాఖ అధ్వర్యంలో పోలీసు కళాబృందం వారి చే సైబర్ మోసాలు, మూఢ నమ్మకాలు,రోడ్డు ప్రమాదాలు, సామాజిక రుగ్మతుల వంటి పలు అంశాలపై కనువిప్పు కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అవుల తిరుపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచితుల ఫోన్ చేసి బ్యాంక్ ఖాత వివరాలు, పిన్ వంటి రహస్య నంబర్లు అడిగినా సమాచారం ఇవ్వొద్దన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడం సరికాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు. రోడ్డు నిబంధలను ప్రతి ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం సభ్యులు బాలనర్సు,రాజు, రవీందర్, తిరుమల, మండల పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**హుస్నాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా వుక్రవారం రోజున ఆర్యవైశ్య మహిళలు గణపతికి కుంకుమ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గణనాదునికి రకరకాల నైవేద్యాలు సమర్పించారు.

## వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కోల్పోవడం దేశానికి తీరని లోటని టిపిసిసి అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా నర్సాపూర్‌లోని చిల్డ్రన్‌పార్క్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, రుస్తుంపేట ఎంపిటీసీ లక్ష్మి అశోక్, నాయకులు శ్రీశైలంయాదవ్, రాధాకృష్ణాగౌడ్, దేవిసింగ్, మల్లేష్ యాదవ్, రశీద్, యువజన కాంగ్రెస్ నాయకులు అజ్మత్, ఉదయ్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ నాయకులు మణిదీప్, నరేశ్,కృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**నర్సాపూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. అదేవిదంగా ఉచిత అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, హాస్టలన వసతి, బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాలలో ఎంపిసి, సిఈసి, హెచ్ఈసి, బిపిసి ఇంగ్లీస్ మీడియంలో అడ్మిషన్‌లు ఉన్నాయన్నారు. హెచ్ఈసి ఉర్దూ మీడియంలోనూ అడ్మిషన్‌లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రణీత్, నాగరాజు, వీరాంజనేయులు, కళింగరెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ చాముండేశ్వరి**

**నర్సాపూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌ను వాడకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చాముండేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం 12వ వార్డులో ప్రజలకు ప్లాస్టిక్ వాడవద్దంటూ వారికి అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అదేవిధంగా బస్టాండ్ హనుమాన్ ఆలయంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా 12 వార్డు కౌన్సిలర్ లక్ష్మి నాగేశ్ అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ చాముండేశ్వరి తో పాటు వార్డు కౌన్సిలర్ లక్ష్మి నాగేశ్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సిబ్బంది మధు, పాపారావు, మురళీ, పాల్గొన్నారు.

## జక్కపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**నర్సాపూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామంలోని తెలంగాణ మాడల్ స్కూల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఎంపిసిలో సైదాబేగంకు 470కి 463 మార్కులు వచ్చాయి. బిపిసిలో నిగర్ సుల్తానాకు 440కి 416 మార్కులు వచ్చాయి, అదేవిధంగా సీఈసిలో అమ్రీన్‌కు 500కు 482 మార్కులు వచ్చాయని ఆమె తెలిపారు. స్వతంత్ర వజ్రోత్సవాల్లో భాగంగా మండలస్థాయి క్రీడల పోటీల్లో కబడ్డి, వాలీబాల్, అథ్లెటిక్‌లో ప్రతిభ చూపించారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పిడి అశోక్‌ను ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మా ప్లాట్లను మాకు ఇప్పించండి

**హుస్నాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త :** రియల్టర్ల నుండి మా ప్లాట్లను మాకు ఇప్పించాలని కోరుతూ హుస్నాబాద్ ఆర్డీవో జయచంద్రారెడ్డిని శుక్రవారం బాధితులు కొహెడ కొమురయ్య, కోనేటి కిరణ్, తోకల కనుకయ్య, గట్ల సంపత్, బత్తుల చంద్రమౌళి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 సంవత్సరంలో హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో ప్లాట్లు కొనుగోలు చేసి హద్దులు ఏర్పాటు చేసుకున్నామని ఈ ప్లాట్లను ఇటీవల రియల్టర్లు మాడ నాగరాజు,చొల్లేటి శంకరయ్య,కొండ్లె శరత్,తేరాల సత్యనారాయణ,తేరాల మారుతిలు ఆక్రమించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం హుస్నాబాద్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

# దేశానికే ఆదర్శం తెలంగాణ సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి**

**కౌడిపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

వయోవృద్ధులకు ఆసరా కల్పించే విధంగా ప్రతి నెల రూ. 2000 పింఛన్‌ను అందిస్తూ దేశంలోనే తెలంగాణరాష్ట్రం ఆదర్శంగా నిలబడిందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శు క్రవారం కౌడిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండో విడత మంజూరైన ఒంటరి మహిళలకు పింఛన్లను పంపిణీ చేసే సమావేశాన్ని ఎంపిపి రాజునాయక్ అధ్యక్షతన కొనసాగింది. సమావేశానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సనీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్హులై ఉండి పింఛన్ రానివారికి త్వరలోనే మంజూరవుతాయని అధైర్య పడవద్దన్నారు.అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒంటరి మహిళలకు సైతం పింఛన్లు ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికే చెందుతుందని అన్నారు. కౌడిపల్లి మండలానికి 1031 పింఛన్లు,17 మందికి కళ్యాణ లక్ష్మి షాదీముబార్ చెక్కులను వారిద్దరూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్‌గుప్తా, కౌడిపల్లి ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మహమ్మద్ హైమద్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు గుంజరి ప్రవీన్‌కుమార్, జడ్పిటిసి కవిత, అమర్‌సింగ్ ఎంపిటిసిలు శివకుమార్‌యాదవ్, స్వప్నకిషోర్‌గౌడ్, సర్పంచుల కురుమ షేకులు నరహరి దివ్యమైపాల్‌రెడ్డి, సుజాత కాంతారావు, వనజ శ్యాంసుందరావు, టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చెన్న కృష్ణగౌడ్, ఎంపిడివో భారతి ఎమ్మార్వో వెంకటేశం నాయకులు దుర్గారెడ్డి, రహీం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణలక్ష్మి చెకు ï్లను పంపిణీ చేస్తున్న మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

**కౌడిపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**కౌడిపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శుక్రవారం కౌడిపల్లిలో సుడిగాలి పర్యటన చేశారు. తాడేపల్లిలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయానికి ప్రహరీగోడ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. కౌడిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రం కృష్ణగౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ చిలుములు వెంకటేశ్వరరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ హైమద్, టిఆర్ఎస్ నాయకులు నవీన్‌రావు, దుర్గారెడ్డి, శ్యాంసుందర్ రావు, నాయకోటి లింగం, కాంతారావు, అంబట సత్యనారాయణగౌడ్, అన్నలు గౌడ్ లక్ష్మీనారాయణ గౌడ్ చంద్రవెంకట్‌గౌడ్ రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.


వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## మహానేతకు ఘన నివాళి

**నిజాంపేట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ 13వ వర్ధంతిని జరుపుకొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, అధ్యక్షులు రమావత్ వినోద్, గరుగుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తిలో...**


వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద శుక్రవారం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు మల్లేశం, రాములు, మైసయ్య, నిరంజన్‌రెడ్డి, దుర్గాగౌడ్, పోతిరెడ్డి, యాదిగిరి పాల్గొన్నారు.

## పాపన్నపేట బంద్ విజయవంతం


నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

**మెదక్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ప్రభుత్వం హిందూ వ్యతిరేక విధానాలను అవలంభించాన్ని నిరసిస్తూ శుక్రవారం పాపన్నపేటలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూ ఐక్యవేదిక సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్న సందర్భంగా మాట్లాడుతూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై అక్రమంగా కేసులు నమోదు చేయడమే కాకుండా పిడియాక్ట్ నమోదుచేసి జైల్లో పెట్టడం దారుణమన్నారు. రాజాసింగ్‌పై పెట్టిన ప్రతి కేసును భేషరతుగా కొట్టేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సంగమేశ్వర్, కృష్ణ, ఏబివిపి అధ్యక్షులు సతీష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సాయి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి

**-టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ మ్యాడం బాలక్రిష్ణ**

**మెదక్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ సమీపంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో పాపన్నపేట మండలంలోని మల్లపేట గ్రామానికి చెందిన విద్యార్థి సాయికిరణ్ గౌడ్ విద్యుత్ షాక్‌తో అకాలమృతికి ప్రభుత్వం బాధ్యతవహిస్తూ సాయి కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ మ్యాడం క్రిష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మల్లపేట గ్రామానికి చేరుకుని సాయికిరణ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మ్యాడం బాలక్రిష్ణ మాట్లాడుతూ సాయి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉండేవాడని, జిల్లా స్థాయి కబడ్డీ పోటల్లో విజయం సాధించాడని గుర్తు చేశారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే సాయి మృతి చెందాడని ఆరోపించారు. సాయి కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

## వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**వెల్దుర్తి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు కొనసాగిస్తున్న సమ్మె శుక్రవారంతో 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్ఏల సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ వీఆర్ఏలు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యాదగిరి, రాములు, రమేష్, పోచమ్మ, మల్లయ్యలతో పాటు ఆయా గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఎస్టీయూ టీఎస్ వజ్రోత్సవ వేడుకలు జయప్రదం చేయండి

**జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్**

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** ఎస్టీయూ టీఎస్ 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని స్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలంలోని వివిధ పాఠశాలల్లో వజ్రోత్సవాల ప్రచార కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ రాష్ట్రంలో నాటి నిజాం ప్రభుత్వ నియంతృత్వ విధానాలను, నిరంకుశ పాలనను ప్రతిఘటించి ఉపాధ్యాయ హక్కుల సాధనకు సంఘటిత శక్తిగా, ఉద్యమ సంఘంగా ఆవిర్భవించి నేటికి 75 వసంతాలు పూర్తి చేసుకొని 76వ వసంతంలోకి అడుగు పెట్టిన ప్రభుత్వ గుర్తింపు కలిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ వ్యవస్థాపక, శాశ్వత సంఘం ఎస్టీయూ టీఎస్ తన 75 సంవత్సరాల ప్రస్థానంలో ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కులపై, విద్యారంగ పరిరక్షణకై చేసిన పోరాటాలు ఎన్నో అని, నడిపిన ఉద్యమాలు ఎన్నెన్నో అని, ఉద్యమాలతో సాధించిన శాశ్వత ప్రజయోజనాలకు నేటికీ ఉపాధ్యాయ లోకం పొందుతూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కిష్టయ్య, సిద్ధిరాములు, మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, వరప్రసాద్, విజయ్ కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రులు

**మండపాలవద్ద సామూహిక కుంకుమపూజలు**

**రామాయంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :** వినాయక నవరాత్రులను భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొల్పిన వినాయక మండపం ఆవరణలో కాలనీ మహిళలంతా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారంతా కుంకుమ పూజలు నిర్వహించి వారి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహాలక్ష్మి పూజను కాలనీ వాసులు కుటుంబసమేతంగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారికి మహా నైవేద్యం సమర్పించి కాలనీలో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమం కాలనీ వాసుల అందరి సహకారంతో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల సత్యనారాయణ, బల్ల యాదగిరి, బల్ల భూమేష్, మద్దెల రాజేశం, స్వామి, భరత్, శరత్, పూసల మహేష్, రొయ్యల హరిప్రసాద్‌లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

హుస్నాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని డిసిసి అధికార ప్రతినిధి కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లింగమూర్తి మాట్లాడుతూ పేదల సంక్షేమ కోసం వైఎస్ఆర్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలు మరిచిపోరన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మరవిందర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, పున్న లావణ్యసది, వల్లపు రాజు, నాయకులు గొర్ల వీరన్న, జవమార్‌నాయక్, బురుగు కిష్ట స్వామి, వెన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని కాంగ్రెస్ పార్టీ కొండపాక అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి ప్రణవి, పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ 13వ వర్ధంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వహీద్‌ఖాన్, జిల్లా బిసిసెల్ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, మైనార్టీ నాయకులు క్యాసారం బాబా, గుండు లక్ష్మణ్, పిఎసిఎస్ డైరెక్టర్ బాల్‌రెడ్డి, అంజియాదవ్ పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

బెజ్జంకి, సెప్టెంబర్ 2,ప్రభాతవార్త: మాజీ సిఎం వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలను శుక్రవారం మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద డాక్టర్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ రాష్ట్రానికి చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు గూడెల్లి శ్రీకాంత్, వడ్లూరి పర్శరాములు, మానాల రవి, దోనె వెంకటేశ్వర్‌రావు, చెలుకల నరేందర్‌రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



హుస్నాబాద్‌లో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బెజ్జంకిలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి

**కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్**

హుస్నాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త

హుస్నాబాద్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : విద్యార్థులు ఇప్పుడు చదవకపోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని బాలుర, బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వెంకట్ ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను పంపణీ చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బండారు మనీల, డా వెంకట్, జగన్, రమణారెడ్డి, రాజేందర్, సుభాష్, రమేష్, రాజమల్లు, జాయింట్ కలెక్టర్ స్నేహితులు కొత్తపల్లి అశోక్, రమేష్, శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



జెండాను ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : ఈ నెల 4న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ధర్నాకు ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం జెండాను ఊపి వాహనాన్ని ప్రారంభించారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఢిల్లీలో మోహంగాహి పర్‌హల్లా బోల్ పేరుతో రామ్ లీలా మైదానంలో నిర్వహించే ర్యాలీ కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమ్మూ నర్సింగరావు, ఉడుముల భాస్కర్‌రెడ్డి, ఉడుముల బాల్‌రెడ్డి, కామిడి జీవన్‌రెడ్డి, కౌన్సిలర్ సందుల సురేష్, శివయ్యగౌడ్, కాటం మల్లేశ్, ఒగ్గు మల్లేశం పాల్గొన్నారు.

## అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

**-సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య**



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గజ్వేల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పది సంవత్సరాలుగా గజ్వేల్ పట్టణంలో ఇల్లు లేని పేదలకు ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ ఇవ్వలేదన్నారు. ఇంటి అద్దెలు రూ.3 వేల నుంచి రూ. 8 వేల వరకు ఉన్నాయని, సాధారణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో ఐదు సంవత్సరాలుగా 1250 ఇళ్లు నిర్మించి ఇంతవరకు లబ్ధిదారులకు అందించకపోవడం ఏమిటన్నారు. నిజమైన పేదలను గుర్తించి తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, ఐద్వా నాయకురాలు రాణి, ఫౌజియా, లక్ష్మి, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టి రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఏజెంట్లు

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): ఆల్ ఇండియా లియాపి జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గజ్వేల్‌లోని ఎస్ఓలో ఎల్ఐసి ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీదారులుకట్టే ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టి రద్దు చేయాలని, పాలసీదారులకు బోనస్ రేట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ లీడర్ దోమకొండ సురేందర్‌కుమార్, ఎల్ఐసి శాటిలైట్ ఆఫీస్ అధ్యక్షుడు మోతె వీరారెడ్డి, కార్యదర్శి సాంబయ్య, డివిజన్ నాయకులు బట్టు మహేందర్‌రెడ్డి, కోడూరి శ్రీధర్‌రెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌గా భవాని

మర్కుక్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): మర్కుక్ నూతన తహసీల్దార్‌గా వై.భవాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె వర్గల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై మర్కుక్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన అహ్మద్‌ఖాన్ బదిలీపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు లేకుండా చూస్తానని, రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

## విద్యార్థిని సన్మానించిన ముదిరాజ్ సంఘం

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త : ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన హుస్నాబాద్ పట్టణానికి చెందిన పిట్టల సుష్మితను శుక్రవారం రోజున మత్స్య పారిశ్రామిక సంఘం కార్యదర్శి రాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ నిరుపేద ముదిరాజ్ కుటుంబానికి చెందిన సుష్మిత పట్టుదలతో చదివి ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థయి ర్యాంకు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు.సుష్మిత రానున్న రోజుల్లో ఉన్నత చదువులు చదివి ఈ ప్రాంతానికి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పొన్నం మల్లయ్య,డైరెక్టర్లు మల్లేశం,చిరంజీవ,కనుకయ్య, సభ్యులు చొప్పరి శ్రీనివాస్,నీలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా సిఎం కెసిఆర్ ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు పేర్కొన్నారు. శుక్రవారం 1వ వార్డు బిసి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన యూనిఫాంలు ఎంఈఓ సునీతతో కలిసి అందజేశారు.కార్యక్రమంలో 1వ వార్డు అధ్యక్షుడు బాకి స్వామి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంగాపురం ఎల్లం, పార్టీ సీనియర్ నాయకులు అటుకూరి స్వామి, పాములపర్తి స్వామి, ఎర్రవాడ నాగరాజు, ఎర్రవాడ బిక్షపతి, కర్ణాకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా

మర్కుక్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దపల్లి మంజులకు మంజూరైన సిఎం సహాయని రూ. 60 వేల చెక్కును శుక్రవారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రంలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి బాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం మండలఅధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ, నాయకులు నరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు గణేష్, ఎస్ఎంసి చైర్మన్ చిన్నబోయిన మల్లేశ్, దుర్గాప్రసాద్‌గౌడ్, మేకల శ్రీనివాస్, బోయిని ఆంజనే యులు, జుట్టు సుధాకర్, వెంకటేశం, స్వామిగౌడ్, యాదగిరి, పోచాగౌడ్, కనకయ్య ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మర్కుక్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన మంగలి నర్సింలు అనారోగ్యంతో గురువారం మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రంలు శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ రూ.3వేలు అందజేశారు. వీరితో పాటు మేకల శ్రీనివాస్, వార్డు సభ్యుడు గణేష్, మంగలి గురువయ్య, రమేష్, రాజు, శంకర్, మంగలి నర్సింలు తదితరులు ఉన్నారు.

**జగదేవ్‌పూర్‌లో...**

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): మండల కేంద్రానికి చెందిన జగదేవ్‌పూర్ సెక్షన్ మీటర్ రీడర్ తాతెల్లి భాస్కర్ ప్రమాదవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న మీటర్ రీడర్ల యూనియన్ సభ్యులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 27వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలిసి పని చేసిన తోటి మిత్రుడు ప్రమాదవశాత్తు మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్ యూనియన్ సభ్యులు ప్రవీణ్, మరాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే టిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

మర్కుక్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): పేదల సంక్షేమమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పనిచేస్తున్నట్లు ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ తెలిపారు. శుక్రవారం దామరకుంట గ్రామానికి చెందిన రాజమైన రాజయ్యకు సిఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.లక్ష చెక్కును సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, ఏఎంసి డైరెక్టర్ పత్తి బాబుతోకలిసి లబ్దిదారునికి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేష్, నాయకులు సాయికుమార్, వెంకటేష్, లతీఫ్, భానుయాదవ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య

హుస్నాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని కౌన్సిలర్ కొ ంకటి నళినిదేవి రవి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని ఒకటవ వార్డులోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో యూనిఫాం(బట్టలు) పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ నళినిరవి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పుడే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు.విద్యార్థి దిశలోనే కష్టపడి చదివితే జీవితాంతం సుఖంగా ఉండవచ్చన్నారు.ఒక్క చదువే కాకుండా క్రీడల్లో సైతం రానించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎల్ఓసి చెక్కు అందజేత

రాయపోల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి అన్నారు. రాయపోల్‌కు చెందిన సత్తుగారి సిద్దార్థరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడానికి సిఎం సహాయనిధి నుండి మంజూరైన 2లక్షల 50 వేల ఎల్‌ఓసి చెక్కును శుక్రవారం ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజిరెడ్డి బాధిత కుటుంబానికి అందజేసారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్‌గౌడ్, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లు

చిన్నకోడూరు, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: పేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని సర్పంచ్ లింగయాదవ్ అన్నారు. పెద్దకోడూరులో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్యాంపు నోడల్ అధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్, అప్తాల్మిక్ ఆఫీసర్లు శ్రీనాథ్, భద్రయ్య, తిరుపతి, హెల్త్ అసిస్టెంట్లు మహేందర్, లక్ష్మారెడ్డి, సూపర్‌వైజర్ శాంతకుమారి, ఎఎన్ఎంలు తిరుమల, యాదమ్మ, అశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

చేర్యాల, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని సిపిఎం మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో డిమాండ్ చేశారు. వీఆర్ఏలు 40 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన వీఆర్ఏలపై ఇంత చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. ఇప్పటికైన వారి న్యాయమైన డిమాండ్లను అమలు చేసి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటి సభ్యుడు గొర్రె శ్రీనివాస్, రాములు, నాలుగు మండలాల వీఆర్ఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలో ఓ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టర్ అక్రమంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్‌లపై చర్యలు తీసుకోవాలని సీఎంఓ, మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సరైన అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన అపార్టుమెంట్‌లను వెంటనే కూల్చివేయాలన్నారు. నిబంధనల ప్రకారం అపార్టుమెంట్‌లు నిర్మించకుండా ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీసుకోకుంటే అందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సందబోయిన పరుశరాం, బత్తిని గణేష్, ఉడుత జయంత్, గొల్లపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వారికి కుంకుమార్చనలు

కొమురవెల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ నిత్యానస త్రంలో శుక్రవారం కొమురవెల్లి అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా మూడో రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అర్యవైశ్య మహిళ సభ్యులు, కొమురవెల్లి పట్టణ అధ్యక్షులు అంబటిపల్లి బుచ్చిలింగం, సభ్యులు గణపతి, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సహ చట్టంతో సమాచారం ఇవ్వండి

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : మండలంలోని మడత గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనుల్లో గ్రామ సర్పంచ్ గీకురు రాజేశ్వరివెంకటేశం నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ శుక్రవారం రోజున గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) ద్వార ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి వనితకు హుస్నాబాద్‌కు చెందిన యువకుడు ఆర్టీఐ ద్వార దరఖాస్తు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో జరిగే ప్రతి పనిలో అవినీతి జరిగిందని, జరిగిన అవినీతి పూర్తి స్థాయిలో బయట పెట్టేందుకు సమాచార హక్కుచట్టం ద్వార దరఖాస్తు చేసినట్లు ఆ యువకుడు తెలిపారు.

## ఇత్తేహద్ ఫౌండేషన్ సేవ కార్యక్రమాలు అడ్డుకోవడం సరికాదు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : ఇత్తేహద్ ఫౌండేషన్ పేరిట చేస్తున్న అన్నదాన తదితర సేవా కార్యక్రమాలను టిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, అధికారులు అడ్డుకోవడం సరికాదని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని జనరల్ అసుపత్రిలో ఫౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలు చేస్తుంటే అసుప త్రి సూపరిటెండెంట్ ఇక్కడ ఏలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించొద్దనడం ఏమిటని ప్రశ్నించారు. సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం అధికార పార్టీ నాయకులకు,అధికారులకు తగదన్నారు. స్వయన మంత్రి హరీశ్‌రావు పార్టీలకు అతీతంగా సేవ కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని చెబుతుంటే సేవ కార్యక్రమాలను అడ్డుకోవడం ఏమిటన్నారు. సేవ కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడడం సరికాదని ఇప్పటికైనా పద్దతి మార్చుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హసునుద్దీన్, ఫయాజ్, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరిట జేబులు నింపుకుంటున్నారు

హుస్నాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త : అభివృద్ధి పేరిట అధికర పార్టీ నాయకులు జేబులు నింపుకుంటున్నారని శివసేనపార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ మల్లిఖార్జునరెడ్డి మండిపడ్డారు.శుక్రవారం హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో మార్కెట్ ఆఫీస్ నిర్మాణం కోసం 1.26కోట్లు కేటాయించి నిర్మాణం చేపట్టగా సంవత్సరం తిరగక ముందే ఆ కార్యాలయం పగులు విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాకుండా మార్కెట్‌లో సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్లన్ని పాడయ్యాయని విమర్శించారు. ఇప్పుడు ఒక కోటి పైన నిధులతో షెడ్ నిర్మిస్తున్నారని ఈ షెడ్ నిర్మాణం వల్ల రైతులు తమ ధాన్యాన్ని ఎండబోసే అవకాశం ఉండదని కావున ఈ షెడ్ నిర్మానాన్ని వెంటనే ఆపి షెడ్‌నే వేరే ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివసేన పార్టీ నాయకులు రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాల వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

బెజ్జంకి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: మండల పరిధిలోని దాచారం గ్రామంలో శుక్రవారం బాల వికాస స్వచ్ఛంద సంస్థ, మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెంటమీది శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం పట్ల సర్పంచ్ బాల వికాస స్వచ్ఛంద సంస్థకు, మెడికవర్ అసుపత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల వికాస ప్రతినిధులు అన్నమేరి సుజాత, సుజాత వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బిజెపిలో చేరుతున్న నాయకులు

## హుస్నాబాద్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం

**-బిజెపి నేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**

హుస్నాబాద్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : వచ్చే ఎన్నకల్లో హుస్నాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తామని బిజెపి నేత బొమ్మ చక్రవర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన దాదాపు 500 మంది కార్యకర్తలు తమ పార్టీలను వీడి బిజెపినేత శ్రీరామ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో కరీంగనర్ ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి,వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న టిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు



బిజెపి తీర్థం పుచ్చుకుంటున్న కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు

కోహెడ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ సమక్షంలో ఆయా పార్టీలకు రాజీనామాలు చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి బండి సంజయ్ పార్టీ జెండాను కప్పి పార్టీలోకి అహ్వానించారు. పార్టీలో చేరిన వారు బిజెపిని మరింత బలోపేతం చేయడానికి సైనికుల్లా పని చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు.

## ముదిరాజ్ సంఘంలో చీలికలు తెస్తే సహించేదిలేదు



మాట్లాడుతున్న ముదిరాజ్‌సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ

మర్కుక్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): ముదిరాజ్ సంఘంలో పదవులు రాని కొందరు ముదిరాజ్ వ్యక్తులు చీలికలు తెస్తే సహించేదిలేదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సంఘం మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం మర్కుక్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు పాతూరు కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ఎర్రవల్లి గ్రామానికి చెందిన కుంట సత్యం ముదిరాజ్ రాష్ట్ర బాధ్యులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరైందికాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఊరుకోబోమని హెచ్చరించారు.ముదిరాజ్ సంఘం ఏకమై హక్కుల సాధనకై పోరాడాల్సిన బాధ్యత ఉందని, నాయకులపై లేనిపోని అబాండాలు వేస్తూ విలువలు తగ్గించుకోవడం సిగ్గుచేటన్నారు. ఇలాంటివి మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం దశరథం, కోశాధికారి సంగం సత్యం, నాయకులు గర్నెపల్లి నర్సింలు, మేకల శ్రీనివాస్, శ్రీరాం వెంకటేష్, మధుకర్, శ్రీశైలం, కర్ణాకర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూములు ఆక్రమిస్తే ఊరుకోం

**-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్**



ఆర్డీవోకి వినతి పత్రం అందిస్తున్న గడిపె మల్లేష్

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన ఎస్సిల ఇంటి స్థలం భూమిసర్వే నంబర్ 478లో 1-26గుంటల భూమిలో సర్పంచ్ దౌర్జన్యంగా భారీ వృక్షాలను తొలగించి రాష్ట్ర ప్రభుత్వం ద్వార మైదానం ఏర్పాటు పేరుతో లాక్కోవడం సరైనది కాదని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేష్ అన్నారు. శుక్రవారం బంజేరుపల్లి గ్రామసర్పంచ్ ఉపసర్పంచ్‌లు ఇద్దరు దళితులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ తాతల తండ్రుల కాలం నుండి ఎస్సిల ఆదీనంలో ఉన్న నివేశ స్థలాన్ని క్రీడామైదానం పేరుతో లాక్కోవడం సరైనది కాదన్నారు. దళితుల ఆధీనంలో ఉన్న భూములలోని భారీవృక్షాలను వాల్టా చట్టానికి విరుద్ధంగా తొలగించిన వారిపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హుస్నాబాద్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడల వనేష్,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవరెడ్డి, నాయకులు పద్మ,భూమయ్య, రాజయ్య, వెంకటమల్లు, కొమురవ్వ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఐని మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్

అక్కన్నపేట, సెప్టెంబరు 2,ప్రభాతవార్త : హుస్నాబాద్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎర్రల కిరణ్‌ను శుక్రవారం అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి సర్పంచ్ గద్దల రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల యూత్ అధ్యక్షుడు చిట్యాల సంపత్,రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొనా న్నరు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

వర్గల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అమరవాది రాజశేఖరశర్మ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయుల బృందం, ఉపసర్పంచ్ పసుల రమేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పసుల రమేష్ మాట్లాడుతూ రాజశేఖరశర్మ పాఠశాలలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యాబోధనపై ప్రత్యేక చొరవ చూపే వారికి అవార్డులు వస్తాయనడానికి రాజశేఖరశర్మ నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

హుస్నాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : పట్టణంలోని 11వ వార్డుకు ఎస్సి,ఎస్టి సబ్ ప్లాన్ నిధులు మంజూరు కాగా వచ్చిన నిధులతో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్,గోవింద రవి,గుళ్ల రాజు,బొజ్జ హరీష ,మ్యాదరబోయిన వేణుయాదవ్, బోజు రమాదేవి, బొల్లి కల్పన శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య పాల్గొన్నారు.



ఆసరా పెన్షన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

## శివ్వంపేటలో ఆసరా పెన్షన్ పత్రాల పంపిణీ

**చౌటకూరు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** టిఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆసరా పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శుక్రవారం మండలంలోని శివ్వంపేట గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 57 ఏండ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పెన్షన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందన్నారు. రైతులు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న చేయూత దేశంలోనే మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి దశరథ్, ఉమ్మడి పుల్కల్ మండల ఎంపిపి ఉపాధ్యక్షులు గాజుల వీరేందర్, శివంపేట ఎంపిటిసి సభ్యులు కిరణ్‌గౌడ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చౌకంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి టిఆర్ఎస్ పెద్దపీట

**అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**



ఆసరా పెన్షన్ పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**జోగిపేట, సెప్టెంబర్02, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరి సంక్షేమంకోసం టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, అదులో భాగంగానే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. శుక్రవారంనాడు మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ ధృవ పత్రాలను లబ్దిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే ఆసరా పథకం కింద పింఛన్లు అందచేస్తున్నట్లు తెలిపారు. అన్నాసాగర్ గ్రామానికి నలభై కొత్త పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ, అన్నాసాగర్ సర్పంచ్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇటిక్యాలలో సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**పుల్కల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామంలో సిఎంఆర్ఎఫ్ చెక్కును టిఆర్ఎస్ నాయకులు పంపిణి చేశారు. గ్రామానికి చెందిన విజయ్‌కు మండల టిఆర్ఎస్ నాయకులు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నల్లమందు ఆనంద, కమ్మరి సుధాకర్, మంగలి శంకర్, ఎల్గోయిల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఏస్గిలో అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలోని ఏస్గి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలను యువత ఘనంగా సన్మానించారు. గ్రామంలోని చావిడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహీమ్, ప్రధాన కార్యదర్శి వై పండరినాథ్ లను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆగస్టు 25వ తేదిన అబ్దుల్ రహీమ్, పండరినాథ జాతీయ అధ్యక్షులు మంగళపల్లి హాస్సెన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డులు అందచేసినట్లు యువకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు మప్పన్న, నమియోద్దీన్, పవన్ స్వామి, ఉమ్యాబ్, గుల్లే శ్రీకాంత్, నర్సింగ్‌రావు, మహిమూద్, నర్సగొండ, వినోద్ కుమార్, ఆసిఫ్, అహ్మద్, సంజీవ్‌కుమార్, సలీంసాబ్, నవాబ్ మియా, మైహుబ్, ఇసామియా తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ క్రికెట్ ఫెడరేషన్ టోర్నికి వేణు ఎంపిక

**చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం టి.మాదారాపూర్ తండాకు చెందిన మాలోత్ వేణు తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిపెట్టాడు. తెలంగాణ సాఫ్ట్ క్రికెట్ ఫెడరేషన్ వారు నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికై అక్కడ నిర్వహించిన పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఆగస్టు నెల 21 నుండి 23 వరకు భోపాల్‌లో నిర్వహించిన పోటీల్లో ఇండియా టీంకి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 26 నుండి 30వ తేది వరకు నేపాల్ దేశంలో నిర్వహించే సాఫ్ట్ క్రికెట్ ఆటలో వేణు ఆడనున్నాడు. జిల్లాకు పేరు తెచ్చి పెట్టిన వేణుని గ్రామ ప్రజలతో పాటు మండల నాయకులు అభినందించారు.

## ఆలయానికి రేకుల షెడ్‌ను ఏర్పాటు చేసిన మన ఊరు సేవసమితి సభ్యులు



హనుమాన్ దేవాలయానికి రేకుల షెడ్‌ను ఏర్పాటు చేసిన మన ఊరు సేవసమితి సభ్యులు

**హత్నూర, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** భక్తులకు ఇబ్బంది కలుగకుండా భక్తుల సౌకర్యార్థం హనుమాన్ దేవాలయంలో రేకులు వేసి సేవాభక్తిని చాటుకున్నారు హత్నూర మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన మన ఊరు సేవసమితి సభ్యులు. వారు తెలిపిన ప్రకారం గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తులకు దేవాలయం ముందు సౌకర్యాలు లేకపోవడంతో సభ్యులు దేవాలయం ముందు నూతనంగా రేకులను వేశారు. తమ కనీస బాధ్యతగా రేకులను వేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఊరు సేవసమితి సభ్యులు ఎ మల్లేశం, జె నారాయణ, వి శ్రీశైలం, సిహెచ్ లక్ష్మణ్, కె ఎల్లం, ఆర్ నర్సింలు, చంద్రయ్య, రమేష్, శంకర్, శివకుమార్, కె పాండు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సిఎం రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి

## వైఎస్ఆర్‌కు మాజీ మంత్రి నివాళులు

**సంగారెడ్డి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల పితామహుడు, పేదల గుండెల్లో గూడుకట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి మాజీ మంత్రి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జెట్టి గీతారెడ్డి ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సుబాష్‌గంజ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, విద్యార్థులకు ఫీజురియాంబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధిహామి పథకం లాంటి ఎన్నో పథకాలను అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, జహీరాబాద్, కోహీర్ మండలాల అధ్యక్షులు నరసింహారెడ్డి, రామలింగారెడ్డి, మొగుడంపల్లి ఎంపిపి అధ్యక్షులు ప్రయాంకగుండారెడ్డి, వైస్‌ఎంపిపి షాకీర్ అలీ, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, షౌకత్ అలీ, నరేష్‌గౌడ్, శుక్లవర్ధన్‌రెడ్డి, కండెం సుజాత, తహేరబేగం, ఖాజా మియా, ఎండి మోయిజ్, శేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, నాగారెడ్డి, నస్రుల్లాఖాన్ పాల్గొన్నారు.

## రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** గత ప్రభుత్వాల హయాంలో అభివృద్దిలో నిరాదరణకు గురైన పల్లెలు, పట్టణాలు టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులతో రాష్ట్రం దూసుకుపోతోందని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాటి, కర్దనూరు, నందిగామ, ఘనాపూర్, భానూర్, క్యాసారం, ఇస్నాపూర్, పాశమైలారం గ్రామాల్లో 2 కోట్లరూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కర్దనూరు, నందిగామ, భానూర్, ఇస్నాపూరర్ గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో లక్ష రూపాయల నిధుల కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని గుర్తు చేస్తూ టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంటి ముంగల అభివృద్ధి, ఇంట్లో సంక్షేమం అన్న సమన్వత లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలను అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు సుప్రజా వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, టిఆర్ఎస్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణలక్ష్మీ, షాదీముబాకర్, ఆసరా పెన్షన్‌ల పంపిణీ

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త**

హత్నూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, ఆసరా పెన్షన్ ధృవపత్రాల పంపిణీ శనివారం హత్నూర మండలంలోని ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో పంపిణీ చేయడం జరుగుతుందని మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతలక్ష్మారెడ్డి లు ముఖ్య అతిథిలుగా హాజరవుతారని అన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు శాసనసమేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## మానవసేవే మాధవసేవ సేవలను గుర్తించాలి

**జెడ్పీటీసీ కుమార్ గౌడ్**



తుడుం శ్రీనివాస్‌ను శాలువతో సన్మానిస్తున్న జెడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన తుడుం శ్రీనివాస్ అంబేడ్కర్ జాతీయ సేవా రత్న అవార్డు-2022 సంవ్స రామునకుగాను ఎన్నికైన సందర్భంగా జెడ్పీటీసీ కుమార్ గౌడ్, సీజేఆర్ ట్రస్ట్ చైర్మన్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి లతో కలిసి తుడుం శ్రీనివాస్ కు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ చేస్తున్న వారికి సేవను గుర్తించి అవార్డు సన్మానించడం ద్వారా సమాజంలో మరింత సేవ చేయడానికి బాధ్యత పెట్టినవారం అవుతారని వారు అన్నారు. ప్రతివారు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండడం వలన త్వరితగతిగా అభివృద్ధి చెందడం జరుగుతుందని, మానవసేవే మాధవసేవ అవుతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కానుకుంటా ఉప సర్పంచ్ పలుకు గోవర్ధన్‌రెడ్డి, చీదు కొండల్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నడిమింటి ఆంజనేయులు, నల్తూరి యాదగిరి, చిరుమాని శ్రీనివాస్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్టు రేంజ్ అధికారిగా రాధికరెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారిగా రాధిక రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఫారెస్టు రేంజ్ అధికారిగా సేవలు అందించిన విజయరాణి హైద్రాబాద్‌లోని జిహెచ్ఎంసి ఫా రెస్ట్ విభాగానికి బదిలీపై వెళ్లడంతో రాధికరెడ్డిని జహీరాబాద్‌కు బదిలీ చేయడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

## రాక్‌సస్టార్ యూత్ గణేశుని వద్ద అన్నదానం

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలో శుక్రవారం అన్నదానం చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాక్‌స్టార్ యూత్ సభ్యులు వినాయక ప్రతిష్ట చేసి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. యూత్‌సభ్యుల విజ్ఞప్తి మేరకు మాజీ సర ్పంచ్-జనచైతన్యసేవాసమితి వ్యవస్థాపకులు అబ్బసాని యాదగిరియాదవ్ విచ్చేసి గణనాధునికి పూజలు చేసిన అనంతరం అన్నసతర్పణను ప్రారంభించారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో వచ్చి వినాయకుడినికి దర్శించుకొని అన్నప్రసాదాన్ని సీ ్వకరించారు.

## కష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయి

**వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రామ్ ప్రసాద్**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** రామచంద్రాపురం మండల వెలిమెల లోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులు శుక్రవారం కొత్తగా చేరిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ప్రెషర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు సంకల్పం, అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. కష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన ఉద్ఘాటించారు. గొప్ప వ్యక్తులందరూ తమ లక్ష్యాలను సాధించడానికి సరైన సమయంలో తెలివైన, సరైన నిర్ణయాలు తీసుకున్నారని, గొప్ప వ్యక్తులు అయ్యారని చెప్పారు. మోడల్ స్కూల్ వెలిమెల బృందం విద్యార్థుల విజయానికి తమవంతు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థులు కూడా తమ చదువులపై ఆసక్తి, మక్కువ చేపి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తడ్కల్‌లో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కళ్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న జెడ్పీటీసీ కోట లతిత ఆంజనేయులు

**కంగ్టి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో శుక్రవారం నాడు స్థానిక ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదేశాల ప్రకారం కంగ్టి మండల జెడ్పీటీసీ కోట లతితఆంజనేయులు, తడ్కల్ సర్పంచ్ గడ్డం మనోహర్ రావు చేతుల మీదుగా చింతల గంగవ్వ కు కళ్యాణలక్ష్మీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటీసీ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి ప్రతి పేదవారికి కళ్యాణలక్ష్మీ, షాదీముబాకర్ పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆదుకోవడం ఎంతో ఆదృష్టమని, ఎంత మంది ఇంట్లో ఆడబిడ్డలు ఉన్నా భయపడే అవసరం లేదని, ప్రతి ఒక్కరికి టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీటీసీ అన్నారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ గడ్డం మనోహర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రజలవరకు అందించిన ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వామేనని అన్నారు. కావున ప్రజలందరు సీఎం కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని చూసుకోవాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కో-ఆప్షన్ సభ్యులు హమ్మద్, మాజీ సర్పంచ్ పండరినాథ్ రావు, తడ్కల్ గ్రామ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పొగాకుల విఠల్ లు పాల్గొన్నారు.

## సజ్జారావుపేట తండాలో సిసి రోడ్డుకు శ్రీకారం



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**సంగారెడ్డి (మొగుడంపల్లి), సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం జహీరాబాద్ శాసనక సభ్యులు కొనింటి మాణిక్‌రావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని సజ్జారావుపేట తండా, జాంగీర్బొలితండా, మిర్జంపల్లితండా, హరిచందర్‌నాయక్ తండా, విట్టునాయక్ తండాలలో కోటి 5 లక్షల రూపాయల ఎస్‌డిఎఫ్ ప్రత్యేక నిధులతో పనులకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆయా తండాలలో ఆసార పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పల్లె అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంకల్పమన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు మోహన్‌రెడ్డి, ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతి నిధులు విజయ్‌కుమార్, కిషన్ పవార్, పరశురాం, శంకర్ నాయక్, రాంశెట్టి, సీతాబా యి జాదవ్, చందు, నారాయణ, కేశు నాయక్, జాదవ్, దశరథ్, అధికారులు పాల్గొన్నారు.

## అధిక సాంద్రతలో పత్తి సాగుతో దిగుబడులు

**జోగిపేట, సెప్టెంబర్02, ప్రభాతవార్త:** అధిక సాంద్రతలో పత్తిపంటను సాగు చేయటం వల్ల సాధారణం కంటే ఎక్కువ దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ తెలిపారు. శుక్రవారంనాడు మండల పరిధిలోని చింతకుంట రైతువేదికలో నిర్వహించిన రైతులకు ఈ విధానంపై పలు సూచనలు చేశారు. ఈ పద్దతిలో పండిస్తున్న రైతులకు పంట పెరుగుదలను నియంత్రించేదుకు గ్రోత్ రెగ్యులేటర్ మందులు అవసరాన్ని బట్టి పిచికారి చేయాలన్నారు. సక్రమంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట అంతా డిసెంబర్ వరకు సిద్ధమవుతుందని తెలిపారు. పత్తి కాయలన్నీ ఒకేసారి పగులుతాయని, ఎకరానికి కనీసం పది నుంచి పదిహేను ఎకరాలు దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయరత్న, ఎఇవో అనిత, రైతుల పాల్గొన్నారు.

## పత్తిపంటపై రైతులకు అవగాహన

**కంగ్టి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని నాగన్‌పల్లి గ్రామంలో పంటల పోషక యాజమాన్య, కీటక ఉదృతి నివారణ కల్పించుటకు శుక్రవారం నాడు మండల ఎంఏఓ ప్రవీణ్ చారి, ఏఈఓ హన్మండ్లు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఏఓ ప్రవీణ్ చారి మాట్లాడుతూ పత్తి పంటలను రక్షణ కల్పించుటకు పువ్వులు, కాయల మీద చీడపురుగులు ఉండడంతో రైతులు పంటలను నష్టపోకుండా పువ్వులు రాలకుండా ఒకరానికి 250 గ్రాముల బోరన్‌లను పిచికారి చేయాలని, అదే విధంగా కాయలపై చీడపురుగులకు బెంజట్, క్లోరోఫైల్‌తో పిచికారి చేయొచ్చని రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ ప్రవీణ్ చారి, ఏఈఓ హన్మండ్లు లతో పాటు రైతులు సాయిలు, చంద్రుగొండ, శివాజీరావ్, సురేష్ రావు పాల్గొన్నారు.

## ఐదు పీట్ల పత్తి సాగుతో అధిక దిగుబడులు

**ఆనందంలో రైతు, ఏఓ**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలో మొదటి మారు పత్తి పంటను 5 పీట్ల దూరంలో విత్తుకుని సాగుచేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలో రైతు అజ్మీర్ భాషా 5 పీట్ల దూరంలో పత్తి విత్తుకుని సాగు చేసుకుంటున్న పంటను ఏఓ, ఏఇఓ సన్నిత్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ 5 పీట్ల దూరంలో విత్తనాలు విత్తుకుంటే మొలకలు తక్కువగా ఉంటాయని, అయితే ఒక్కో మొక్కకు ఖాతా, పూత కలిపి 80 నుంచి 100 కాయలు కాచాయన్నారు. పంట దిగుబడి గతంలో కంటే అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ఏఓతో పాటు రైతు ఆజ్మీర్ భాషా ఆనందం వ్యక్తం చేశారు.

## ఆర్థిక సహాయం అందజేత

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో కుమ్మరి దాసు క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నడు. ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నవీన శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్, గ్రామ టీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలియజేయడం జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆస్పటల్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం సోదరుడు గూడెం మధుసూదర్‌రెడ్డి, ద్వారా 20 వేల రూపాయలు పంపడం జరిగింది. కుమ్మరి దాసు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, ఆపద సమయంలో ఆదుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరభద్ర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, వార్డు సభ్యులు వినోద్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గ్యారాల మల్లేష్, నాయకులు సుంకరి శంకర్, చక్రపాణి, బిక్షపతిరెడ్డి, హరికృష్ణ, రమేష్‌అప్ప, యువత అధ్యక్షులు కావాలిరాజు, ఎస్ మహేష్, కే కృష్ణ, యాదగిరి, ఎం సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పూజలందుకుంటున్న వినాయకుడు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో అందంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులు నిత్యం భక్తులచే పూజా కార్యక్రమాలు అందుకుంటున్నాడు. గ్రామంలో ప్రతిష్టించుకున్న విఘ్నేశ్వరుడిని ఉదయం, సాయంత్రం బ్రాహ్మణులు, జంగములచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండపాల్లో అమర్చిన మైకులు భక్తిపాటలను వల్లెవేస్తుండటంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని చెప్పవచ్చు. మండలంలోని మల్గి గ్రామంలో బొంగొండేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన లంబోదరుడిని యూత్ బాధ్యులు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. మండపానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి, మల్గి గ్రామ సర్పంచ్ మారుతి యాదవ్, అసోసియేషన్ సభ్యులు వైద్యనాథ్, శాంత్‌కుమార్, భీమన్న, పవన్, సునీల్, సందీప్, మహేశ్, మోహన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

**సదాశివపేటలో..**



గణపతికి పూజలు చేస్తున్న జిటిఆర్ డెవలపర్స్ అధినేత తుల్జారాం దృశ్యం

**సంగారెడ్డి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త**

పట్టణంలోని నాగేశ్వర్‌నగర్ కాలనీలో యువసేన యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన తొలిపూజలందుకునే పార్వతీ దేవి తనయుడు నారి గణపతికి జిటిఆర్ అధినేత జి తుల్జారం తొలి పూజలు చేశారు. మండపానికి చేరుకున్న తుల్జారాంను ఉత్సవ కమిటి నిర్వాహకులు, కాలనీవాసులు ఘనంగా స్వాగతం పలుకాగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుల్జారాం మాట్లాడుతూ కాలనీ వాసులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని ఏకదంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఉత్సవాలను ప్రశాంతంగా, ఘనంగా జరుపుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో వన్నె మల్లేశం, ఆంజనేయులు, అరుణ్ ముదిరాజ్, అనీల్ ముదిరాజ్, ప్రశాంత్‌గౌడ్, సంతోష్‌గౌడ్, అఖిల్, సాగర్‌తేజ గౌడ్, దిలీప్, సాయి గౌడ్, శ్రావణ్‌గౌడ్, అరుణ్‌గౌడ్, రాహుల్ పాల్గొన్నారు.

## కూబనాయక్ తండాలో గిరిజనుల పూజలు



పూజలు చేస్తున్న గిరిజనుల దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలోని కుబనాయక్ తండాల్లో గిరిజనులు శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తండాలోని ఆలయాలకు నిండు కళశాలతో భజా భజంత్రీలతో ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో అన్నదానం (ఖాండ్) నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు రాజు రాథోడ్, ఎంపిపి అధ్యక్షులు మోతిబాయిరాథోడ్, కరస్‌గుత్తి సర్పంచ్ సంజీవరెడ్డి, కుబనాయక్ సర్పంచ్ శకుంతల, నాయకులు గణపతిమహారాజ్, శంకర్, పాండు, తండా వాసులు చందర్ నాయక్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన బొజ్జగణపయ్యకు పూజలు

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వినాయక నవరాత్రోత్సవాలు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల పరిధిలోని తీగుల్‌నర్సాపూర్‌లో శ్రీ కొండపోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద స్థానిక సర్పంచ్ గర్నెపల్లి రజితరమేష్, కొండపోచమ్మ ఆలయ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి రాజు, గర్నెపల్లి కొండయ్య, గ్రామస్తులు కనకరెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

**-సిపిఐ నేత ఎంఏ ఖాన్**

**కంది, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** గత మాసం రోజులకు పైగా నిరవధిక సమ్మె చేస్తున్న విఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ నాయకులు ఎంఏ ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం విఆర్ఏలు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి ఎంఏ ఖాన్ చేరుకుని విఆర్ఏలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఏ ఖాన్ మాట్లాడుతూ శాసన సభ సాక్షిగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లేశ్, యాదగిరి, చిన్నపూర్‌మల్లేశ్, ఎండి మహమ్మద్, నర్సింలు, అమరేందర్, శ్రీరాములుస్వామి తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి మున్సిపాలిటీలో..**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** శుక్రవారం నాడు సంగారెడ్డిలో పట్టణ అధ్యక్షులు అనిల్ ఆధ్వర్యంలో వీఆర్ఏలకు టీజీఎఫ్ ఆధ్వర్యంలో పూర్తి మద్దతు తెలపడం జరిగింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై ఒక్కవేయి వీఆర్ఏలు నలభై రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంకు చీమకుట్టినట్లు కూడా కాకపోవడం చాల విడ్డురమని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. వీఆర్‌లను పట్టించుకొకుండా కాలం వెళ్ళబుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జగత్ కృష్ణ, జిల్లా అధ్యక్షులు భాస్కర్, మీడియా ఇంఛార్జి విరేష్, గౌరవ అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శులు నవీన్, రాహుల్, దొడ్ల శుబదాయిని, పట్టణ ఉపాధ్యాక్షులు బ్రహ్మాచారి, మండల అధ్యక్షులు నవీన్, యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

**స్టోర్ ప్రారంభించిన సోచ్**

గత 16 సంవత్సరాలుగా భారతీయ ఎథ్నిక్ వస్త్ర అవసరాలను తీర్చడంలో అగ్రగామిగా వెలుగొందుతున్న సోచ్, తమ 150వ స్టోర్ను ప్రారంభించింది. ఈ స్టోర్ బెంగళూరులో ఉన్నప్పటికీ వేడుకలు మాత్రం దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 59 నగరాలలో సోచ్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏదైనా స్టోర్ను సందర్శించడం ద్వారా 10వేల రూపాయాల విలువైన ఓచర్లను పొందవచ్చు. దేశవ్యాప్తంగా తమ ఔట్లెటులో అత్యాధునిక డిజైను అందుబాటులో ఉన్నాయి. వీట న్నిటినీ అత్యద్భుతమై వస్త్రాలతో డిజైన్ చేశారు. ఇవి చూడగానే ఆక ట్టుకునే సిల్హ్యూటీలు ఆహ్లాదకరమైన రంగులలో లభ్యమవుతాయి.